# జీవఫలం చేదు విషం..

**ఆ**సుపత్రి నుండి 'డిశ్చార్జి' చేయించుకొని, తండ్రిని ఇంటికి తీసుకొచ్చేసరికి పెద్ద గండం నుండి బయట పడినట్టయింది రామకృష్ణకు. తన తండ్రి యిలా చేస్తాడని ఊహకు కూడా అందలేదతడికి! అప్పులుంటే మాత్రం వాటిని తీర్చే మార్గం వెతకల్లగాని ఆత్మహత్యకు పాల్పడటమా? చివరకు నింద తన మీదికే గదా వచ్చేది? ఉద్యోగం చేస్తున్న చెట్టంత కొడుకుండీ, అప్పులు తీర్చలేక పురుగుల మందు తాగినాడంటే...? ఆ కొడుకెలాంటి వాడో అని ఎవరైనా అనుకుంటారు. సిగ్గుతో, బాధతో, భయంతో తల ఎత్తుకోలేక పోయినాడు రామకృష్ణ!

అయితే అతని తండ్రి వెంకట రమణప్ప ఆలోచనలు వేరుగా వున్నాయి! ఆరేళ్ళయింది సరైన పంట పండక! వేరుశనగ పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా నాలుగేళ్లుగా అందలేదు–గతంలోలా కాదు!' ఇప్పుడు ఎకరాకు పెట్టుబడే ఐదువేలు దాటుతోంది. ఇరవై ఎకరాల్లో వేరుశనగ వేస్తే ఎంత పెట్టుబడి కావల్ల? విత్తనాలు, ఎరువులు, మందులు, ట్రాక్టర్ల బాడుగ, కూలీల ఖర్చు ఎంతవుతుందో చేసే వాడికే తెలుస్తుంది. ప్రతి సంవత్సరమూ చేతికందే పంట ఎంత? దానికి పలికే ధర ఎంత? ఆ పంట అమ్మితే వచ్చేది ఎంత? ఇన్సూరెన్స్ ద్వారా లభించేది ఎంత? అన్నీ లెక్కలు వేస్తే ప్రతి సంవత్సరమూ ముప్పయి వేలకు పైగా అప్పు తేలుతా వుంది.

అప్పు అంటే వడ్డీలకు తేవాల్సిందేగదా? బ్యాంకులిచ్చే అప్పుతో పంట సాగవుతుందా? బయట చేయాల్సిందేగదా అప్పు? రెండు రూపాయల వడ్డీకి ఇప్పుడెవడిస్తున్నాడని? తను పండించేది వేరుశనగ పంట కాదు! అప్పుల పంట!! ఈ ఆరేడేళ్ళలో అప్పులూ, వడ్డీ, పెరిగి పెరిగి మూడు లక్షలయిందంటే ఎవరైనా నమ్ముతారా? ఒక పదెకరాలైనా అమ్మి అప్పు తీరుద్దామంటే కొనేవాడెవడు? కొన్నా ఎకరా ఇరవైవేలంటే ఎట్లా అమ్మేది? ఇంటో పెళ్ళి కావాల్సిన ఒక పిల్లా, డిగ్రీ చదివే ఒక కొడుకూ వున్నాడు! వీళ్ళను ఏ గంప కింద మూసిపెట్టల్ల? పెద్ద కొడుకు రామకృష్ణ వున్నాడనుకో! వాడి ఉద్యోగమెంత? అనంతపురంలో ఒక ఆఫీసులో రికార్డ్ అసిస్టెంటు వాడు! వాడికి వచ్చే జీతం వాడికీ, వాడి భార్యకూ ఇద్దరు పిల్లలకు కూడా

చాలదు గదా! వాడున్న ఇల్లు కూడా రెండు ఇరుకు గదులు! ఆ ఇంటికి వెళ్ళటం కూడా తనకు ఇబ్బందే! అలాంటి వాడి నుండి తనేం ఆశిస్తాడు?

రోజూ పేపర్లలో వచ్చే రైతుల ఆత్మహత్యల వార్తలు వెంకట రమణప్ప మనోధైర్యాన్ని దెబ్బ తీసినాయి. ఆత్మహత్యలు చేసుకున్న వాళ్ళంతా రుణభారం మోయలేక తెగించిన వాళ్ళే! నైరాశ్యం, భవిష్యత్తు పట్ల భయం ఎక్కువైపోయిన ఒక బలహీన క్షణాన ఏమనిపించిందో ఏమో పశువులపాకలో అటక మీదున్న ఎండ్రిన్ మందును ఒక్కగుక్కలో తాగేశాడు అతడు. అయితే అది పూర్తిగా కడుపులో చేరకముందే భళ్ళున వాంతి చేసుకున్నాడు. వాంతి చేసుకున్నప్పటి ఆ పెద్ద శబ్దం విన్న పక్క పాకల వాళ్ళు వెంటనే వచ్చి, అతడి స్థితి కనిపెట్టి, అనంతపురంలోని ఒక ప్రైవేటు నర్సింగ్ హోమ్‌కు చేర్చి, అతడు బతికేట్టు చేయగలిగినారు.

మందు కడుపులో పూర్తిగా చేరలేదు గాబట్టి, అతడిని బతికించగలిగినారు డాక్టర్లు! కడుపునొప్పి కింద హాస్పిటల్లో చేర్పించబట్టి సరిపోయింది గాని, ఆత్మహత్య కింద నమోదయితే యింకేమైనా వుందా? తెలిసిన వైద్యశాల కాబట్టి పోలీసు కేసు లేకుండా, తన తండ్రిని కాపాడుకోగలిగినాడు రామకృష్ణ. రెండు రోజుల చికిత్స తర్వాత ఆసుపత్రి నుండి బయటపడినాడు.

ఆసుపత్రికి దగ్గరే రామకృష్ణ వుంటున్న బాడుగ ఇల్లు! కొడుకు ఇంటికి వచ్చి మూడు రోజులు దాటింది! రోజూ రాత్రి కలత నిద్రే! ఆ చిన్న ఇల్లు, తన కోసం వచ్చిన భార్యా, కూతురూ చిన్న కొడుకూ చేరేసరికి మరింత ఇరుకైపోయింది. రేపో మాపో వూరికి పోవల్ల! ఎట్ల జరిగేది అట్ల జరుగుతుంది అనుకున్నాడు రమణప్ప.

రోజూ కంటే ముందుగానే నిద్రలేచినాడు రమణప్ప. ఉదయం ఏడు గంటలు కావస్తుండగా, పాలు పోసే మనిషి వచ్చి తలుపు దగ్గర నిలబడినాడు. వెంకట రమణప్ప అతడిని ఎగాదిగా చూసి, ఎక్కడో చూసినట్టుగా గుర్తు తెచ్చుకోబోతుంటే అతడే "బావున్నావా పెద్దయ్యా" అంటూ పలకరించినాడు. "నేను పెద్దయ్యా కక్కలపల్లి నాగన్న కొడుకును" అని గుర్తు చేసినాడు. ఓర్నీ అనుకొని "ఈ పాలమ్మే పని ఎప్పట్నుండీ" అని అడిగినాడు. "నాలుగేళ్ళయింది – ఈ పాల వ్యాపారమే మా సంసారాన్ని సాకుతోంది" అన్నాడతడు. "తెల్లవారు జామునే వూళ్ళో ఇరవై ఇళ్లలో పాలుపట్టి టౌన్‌కు వచ్చి పోస్తావుండా" అని చెప్పుకొచ్చాడతడు. "అయితే సేద్యం ఎగపెట్టినట్టేనా?" అని రమణప్ప అడిగితే "సేద్దెం చేస్తే అంతే! నీ మాదిరి పురుగుల

మందు తాగాల్సిందే" అని వెళ్లిపోతుంటే, "పాల వ్యాపారంలో యా మాత్రం గిట్టుబాటవుతుందని రమణప్ప ఆసక్తిగా అడిగితే "అదంతా చెప్పగూడదు పెద్దయ్యా" సగటున రోజుకు నాలుగైదునూర్లన్నా గిట్టుబాటవుతుంది" అంటూ వెళ్ళిపోయినాడు పాలమనిషి!

అతడు వెళ్ళి పోయిన తర్వాత కొడుకు రామకృష్ణ. "ఇప్పుడు పాల వ్యాపారానికి తిరుగు లేదు నాన్నా" ఎనుముల్ని మేపి చాకిరీ చేసి పాలుపిండే వాళ్ళకంటే, వాళ్ళ దగ్గర కొని పాలు అమ్మే వాళ్ళే దర్జాగా బతుకుతా వుండారు..." అన్నాడు నవ్వుతూ!

నాలుగు ఇడ్లీలు తిని, ఇంటి బయట ఖాళీ స్థలంలో నిల్చున్నాడు వెంకటరమణప్ప.

"వంకాయలు, బెండకాయలు, బీరకాయలు, పచ్చి మిరపకాయలు, టమోటా..." అంటూ కూరగాయల పేర్లు కేకలు వేస్తూ, తోపుడు బండిని తోసుకుంటూ వచ్చి ఆ ఇంటి ముందు ఆగినాడు కూరగాయలమ్మే మనిషి. తోపుడు బండి నిండా కూరగాయలు మెరుస్తున్నాయి. ఆ వీధిలోని ఆడవాళ్ళు ఆ బండి చుట్టూ క్షణాల్లో మూగినారు. ఆ వైపే చూస్తున్నాడు వెంకట రమణప్ప.

పది నిమిషాల వ్యాపారం తర్వాత, తోపుడు బండి ముందుకు కదిలింది. "ఏ వూరప్పా మీది" అంటూ పలకరించినాడు తోపుడు బండి మనిషిని రమణప్ప.

"ఒకప్పుడు మాది ఈటికి దగ్గర్లోనే వుండే వూరు నాయనా! ఈటౌన్ కొచ్చి ఆరేండ్లయింది. కూరగాయల వ్యాపారం చేస్తావుండాను" అన్నాడతను.

"యా మాత్రం గిట్టుబాటవుతాది" అనడిగాడు రమణప్ప. "రోజూ మండీకి వెళ్లి మారుబేరానికి తెచ్చి అమ్ముతాము నాయనా! జరుగుబాటుకు ఢోకా లేదు" అంటూ ముందుకు కదిలాడతడు.

కూరగాయలమ్మే వాడూ బావున్నాడు. మండీ వాడూ బావున్నాడు. వీటిని పండించే రైతే గదా మధ్యలో చెడింది అని గొణుక్కున్నాడు రమణప్ప. తానూ బావిలో నీళ్ళున్నప్పుడు, బావి కింద అర్ధ ఎకరాలో కూరగాయలు పండించేవాడు. వంకాయలూ టమేటాలూ పచ్చిమిరపకాయలు ప్రతి సంవత్సరమూ పండించేవాడు. ధరలేక దిబ్బల్లో టమేటాలూ పారబోసిన రోజులూ వున్నాయి. పొలానికి వచ్చిన మారుబేరగాళ్ళకు వాళ్ళు అడిగిన రేటుకే యిచ్చిన రోజులూ వున్నాయి. తన దగ్గర కిలో రూపాయికి కొన్న వాటిని టౌనులో ఐదారు రూపాయలకు అమ్ముకుంటుండగా చూసిన రోజులూ

వున్నాయి. ఎక్కడో ఏదో మాయ వుంది. ఏదో తిరకాసు వుంది అనుకొని నిట్టూర్చినాడు రమణప్ప.

సాయంత్రం కోడలు యిచ్చిన గ్లాసుడు కాఫీ తాగి కొద్ది దూరం నడిచివస్తానమ్మా అంటూ ఇంటి దగ్గర నుండి బయలుదేరినాడు రమణప్ప. "ట్రాఫిక్ ఎక్కువగా వుంటుంది వద్దు మామా" అని వారించినప్పటికీ, "ఇంట్లో కూచుని కూచుని కాళ్ళు తిమ్మిర్లు పట్టినాయి. కొద్ది దూరం నడిచి వస్తానమ్మా" అంటూ నెమ్మదిగా అడుగులు వేసినాడు రమణప్ప.

పది నిముషాలు నడిచేసరికి మెయిన్‌రోడ్ వచ్చింది. ఆటోలతో, కార్లతో, ద్విచక్ర వాహనాలతో, వచ్చే పోయే జనంతో రోడ్డు చాలా రద్దీగా వుంది. రోడ్డుకు ఈ వైపు రక రకాల షాపులు. ఆ వైపు ఫుట్‌పాత్ మీద అన్నీ పళ్ళ అంగళ్ళే. రోడ్డు దాటుకొని పళ్ళ అంగళ్ళను చూసుకుంటూ నడుస్తున్నాడు రమణప్ప. చీనీ, సపోటా, బొప్పాయి, దానిమ్మ, బత్తాయి, జామ, అరటి, ద్రాక్షలాంటి పళ్ళు, తోపుడు బళ్ళ మీద గుట్టలు గుట్టలుగా నిండి వున్నాయి. అన్నీ స్థానికంగా రైతులు పండించేవే! ఇవిగాక యాపిల్, అంజూరా, లాంటి దిగుమతి చేసుకొనే పళ్ళూ వున్నాయి. సాయంత్రం పూట కావటంతో కొనేవాళ్ళతో సందడిగా వుంది ఆ ప్రాంతమంతా!

రమణప్ప ఆసక్తిగా పళ్ళను గమనిస్తూ, ఒక తోపుడుబండి ముందు ఆగినాడు. ఆ బండి మీద నిగనిగ మెరుస్తూన్న దానిమ్మ పళ్ళు సైజు వారీగా పేర్చబడి వున్నాయి. ఒక పెద్ద పండును చేతికి తీసుకుని 'ఎట్ల రేటు' అనడిగినాడు రమణప్ప. కేజీ ఎనభై రూపాయలనేసరికి దిమ్మెరపోయినాడు. ఆ పళ్ళు కేజీకి ఐదారు కంటే ఎక్కువ తూగవు. అంటే ఒక్కోటి పదారు రూపాయలా? బేరం చేస్తే కేజీకి పది తగ్గొచ్చు అంతే! వాటిని చూస్తుంటే తమ వూరి దానిమ్మ తోటలు కళ్ళముందు కదిలినాయి... ఐదారేళ్ళ క్రితం తమ వూళ్ళో చాలా మంది రైతులు దానిమ్మ తోటలు వేసినారు. నీళ్ళ ఖర్చు తక్కువ గదా అని! రైతులు మారుబేరగాళ్ళకు 'అమ్మే రేటు కేజీ లెక్కన గాదు – నూరు ఇంత అని. నూరు మూడు వందల లోపే. ఒక్కో కాయ మూడు రూపాయలకంటే ఏ రైతూ అమ్ముకోలేక పోయినాడు. సైజు చిన్నగా వుంటే నూరు లోపే! ఇక్కడ చూస్తే కాయ రేటు పదారు పలుకుతోంది. ఎంత అన్యాయం? కొందరు రైతులు ధర గిట్టుబాటు గాక, రెండు మూడు కాతల తర్వాత దానిమ్మ చెట్లు కొట్టి వేసినారు

పాపం! చేతిలో పట్టుకున్న పండును బండి మీదే పెట్టి ముందుకు నడిచినాడు రమణప్ప.

బొప్పాయి పళ్లు కేజీ ఇరవై! రెండు కూడా తూగవు. రైతు దగ్గర కొనేది కేజీ నాలుగైదు రూపాయలే! నాలుగేళ్ళ క్రితమైతే కేజీ రూపాయే!

చీనా పళ్ళు కేజీ నలభై! ఎనిమిది తూగుతాయి. రైతు దగ్గర వంద ఇంత అని కొంటారు. ఆ రేటుకూ ఈ రేటుకూ సంబంధమే వుండదు.

జామపళ్ళయితే రైతు దగ్గర బుట్ట ఇంత అని కొంటారు. తోపుడు బండి మీద పది రూపాయలకు ఐదు – రేగుపళ్ళు కూడా కేజీ ఇరవై రూపాయలు – రైతు దగ్గర కొనేదిమాత్రం గోనె సంచుల లెక్కన కొంటారు. కేజీ రెండు రూపాయలు కూడా పడదు.

ప్రతి తోపుడు బండి దగ్గరా రమణప్ప విచారిస్తూనే వున్నాడు. వీళ్ళెవరూ రైతు దగ్గర నేరుగా కొనేవాళ్ళుకాదు. మండీ వ్యాపారి దగ్గర మారు బేరానికి కొనేవాళ్ళే! ఏ పండు ధర చూసినా, రైతు దగ్గర కొనే ధరకూ బళ్ళ మీద అమ్మే ధరకూ పొంతనే లేదు. రైతులు అమ్మే ధర తనకు తెలుసు. ఈ బళ్ళ మీద అమ్మే వాళ్ళందరూ, వాళ్ళ మాటల్లోనే రోజుకు ఐదారు వందలకు పైగా సంపాదిస్తున్నారు. ఇక మండీల వాళ్ళు ఎంత సంపాదిస్తున్నారో రమణప్ప వూహకు కూడా అందలేదు – వీటిని పండించే రైతులు మాత్రం పెట్టుబడులు గిట్టక, పండిన పంటకు ధర గిట్టక అప్పుల పాలవుతున్నారు – రైతులు సంవత్సరమంతా కష్టపడి, కుటుంబమంతా శ్రమ ధారపోసి పండిస్తుంటే, రైతు ఉత్పత్తుల్ని అమ్మేవాళ్ళంతా నిమ్మళంగా రోజువారీ ఆదాయాలతో సుఖపడుతున్నారు. రమణప్ప మనసంతా చీకాకుతోనూ, దిగులుతోనూ నిండిపోయింది.

ఆ సమీపంలోనే వున్న ఒక పెద్ద వేప చెట్టు నీడన, చెరుకు గడల్ని మిషన్‌లో క్రష్ చేస్తూ, చెరుకు రసాన్ని గ్లాసుల్లో పోసి అమ్ముతున్నాడొకాయన.అతడి భార్య కూడా అతని పక్కనే వుండి సాయపడుతోంది. రమణప్పకు చెరకు రసం తాగాలనిపించింది. చెట్టు  కింద కస్టమర్ల కోసం వేసిన ఒక బెంచీ మీద కూచున్నాడు. కూచోగానే 'బావున్నావా రమణప్పన్నా" అంటూ చెరకు రసాన్ని గ్లాసులో నింపుతున్న మనిషి పల్కరించినాడు. వెంటనే గుర్తుపట్టినాడు అతడిని... "నువ్వా లక్ష్మన్నా! ఈ బిజినెస్ నీదేనా" అని ఆసక్తిగా అడిగినాడు.

"ఔనన్నా! మూడేళ్ళయింది... ఇదే చెట్టు కింద చెరుకు రసం అమ్ముతున్నాము. కాపురం కూడా టౌన్‌లోనే. వారానికోసారి వెళ్ళి రైతుల దగ్గర చెరుకు తెస్తాను" అన్నాడు. మిషన్ పక్కనే గుట్టగా చెరుకు గడలున్నాయి.

చాలా సేపు విషయాలు మాట్లాడుకున్నారు వాళ్ళు. శనక్కాయ వేసి వేసి అప్పులపాలై కడాకు ఈ వ్యాపారంలోకి దిగినట్టు చెప్పినాడు లక్ష్మన్న. ఒక కొడుకు డిగ్రీ, ఇంకో కొడుకు ఇంటరూ ఇక్కడే చదువుకుంటున్నారట. ఇందిరమ్మ ఇల్లు సంపాదించుకున్నాడట. అన్ని కాలాల్లోనూ ఈ వ్యాపారం బాగా జరుగుతుందట! ఎండాకాలమైతే తీరికే వుండదట.. "చెప్పగూడదుగాని రోజూ రెండు వేలకు పైగా వ్యాపారం జరుగుతుందన్నా! సగం లాభం" అంటూ ఒక గ్లాసులో చెరుకు రసం పోసి, ఒక ఐస్ ముక్క వేసి, చిటికెడు మిరియాల పొడి జల్లి, రమణప్పకు ఇచ్చినాడు. గ్లాసు పది రూపాయలట! రమణప్ప డబ్బీబోతే తీసుకోలేదు! తన విషయం ఏమీ చెప్పలేదు రమణప్ప! లేచి నిల్చుని చుట్టుపక్కల చూసినాడు. అదే చెట్టునీడలో పచ్చివి వేరు శనక్కాయలమ్ముతున్నాడొకడు. బొప్పాయి పళ్ళను జివిరి, ముక్కలు కోసి ప్లేట్లలో పెట్టి అమ్ముతున్నాడింకొకడు. బత్తాయి రసం అమ్ముతున్నాడు మరొకడు. కొబ్బరి బోండాలను కొట్టి అమ్ముతున్నాడొకాయన. చిన్న కుండీల్లో పెట్టిన పూల మొక్కల్ని అమ్ముతున్నాడు ఓ కుర్రవాడు.

చూడగా చూడగా అందరూ రైతు ఉత్పత్తుల్ని అమ్ముతున్న వాళ్ళే. పెద్ద పెట్టుబడి లేకుండా రోజూ అందరూ నాలుగైదు వందలకు పైగా సంపాదిస్తున్న వాళ్లే!

అయితే వీటిని ఉత్పత్తి చేస్తున్న రైతు మాత్రం భారీ పెట్టుబడులతో, ఆరుగాలం శ్రమిస్తూ, పంటలు సరిగా పండక పండిన పంటకు ధర పల్కక, అప్పుల పాలవుతున్నాడు. ఆత్మ హత్యలకు కూడా పాల్పడుతున్నాడు. ఎక్కడో ఏదో మోసం జరుగుతోంది. ఏదో అన్యాయం పట్ట పగలు కళ్ల ముందే కనబడుతోంది. ఆలోచించే కొద్దీ నీరసం వచ్చింది రమణప్పకు. నిర్వేదంతో మనసు ముడుచుకు పోయింది. అదే సమయంలో, అతని ఆలోచనల్లో, ఉన్నపళంగా ఒక్క చిన్న మెరుపు మెరిసింది!

ఆరు నెలల తర్వాత, రామచంద్రానగర్‌లో ఒక కొత్త కంఠం ఖంగున మోగింది. "వంకాయలు, బీరకాయలు, బెండకాయలు, పచ్చి మిరపకాయలు, టమేటాలు, కాకరకాయలు, ఆకు కూరలు," అంటూ గొంతెత్తి వీధి మొత్తం వినిపించేట్టు, ఆ కంఠం నినదిస్తోంది.

❖ **నవ్య వీక్లీ, 1.2.2012**